

మంగళవారం ఢిల్లీలో ప్రధానమంత్రి మోదీని కలిసిన తర్వాత మీడియాతో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి. చిత్రంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

# ఆర్థికంగా ఆదుకోండి

▶ మొదటిపేజీ తరువాయి...

రాష్ట్ర ప్రయోజనాలను కాపాడటం కోసం, ప్రజాస్వామ్య స్ఫూర్తితో తొలిసారిగా దేశ ప్రధాని మోదీని మర్యాదపూర్వకంగా సీఎం హోదాలో రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం హోదాలో తాను కలిసినట్టు వెల్లడించారు. విభజన చట్టం హామీలను ప్రధాని దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిపారు. బయ్యారం ఉక్కు పరిశ్రమ, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, ఐటీఐఆర్ ప్రాజెక్టులను వెంటనే ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసినట్టు చెప్పారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వాలని విన్నవించినట్టు తెలిపారు. వీటితోపాటు ఐఐఎం, సైనిక్ స్కూల్, నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా వద్ద గల 14 రోడ్ల ప్రతిపాదనలను, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి కేటాయించే గ్రాంట్స్‌ను విడుదల చేయాలని ప్రధానిని కోరినట్టు చెప్పారు. కేంద్ర ప్రభుత్వంనుంచి రాష్ట్రానికి రావాల్సిన రూ.2,250 కోట్ల గ్రాంట్స్‌ను సాధ్యమైనంత త్వరగా విడుదల చేయాలని విన్నవించినట్టు తెలిపారు. తమ విజ్ఞప్తులపై ప్రధాని సానుకూలంగా స్పందించారని తెలిపారు.

### అరగంటపాటు భేటీ

ప్రధాని మోదీతో భేటీ కోసం సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క బేగంపేట నుంచి ప్రత్యేక విమానంలో ఢిల్లీకి వెళ్లారు. ప్రధాని నివాసంలో ఇద్దరు నేతలు అరగంటపాటు మోదీతో సమావేశమయ్యారు.

# దరఖాస్తులో డౌట్లెన్నో!

- గందరగోళంగా 'ఆరు గ్యారెంటీల' అప్లికేషన్స్
- పథకాలవారీగా దరఖాస్తా? అన్నింటికీ ఒకటేనా?
- ఒక్కో వ్యక్తికి ఒక అప్లికేషనా? కుటుంబానికి ఒకటా?
- ఉచిత విద్యుత్తు, 'కౌలురైతు'కు ఎట్లా అప్లై చేసుకోవాలె?
- మహిళలు మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిందేనా?
- అప్లికేషన్లపై సర్కారుకు స్పష్టతేదీ?




హైదరాబాద్, డిసెంబర్ 26 (నమస్తే తెలంగాణ): ఆరు గ్యారెంటీల అమలుకు కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన దరఖాస్తుల ప్రక్రియపై ప్రజల్లో అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఏ పథకానికి ఎవరు.. ఏ విధంగా దరఖాస్తు చేయాలనేదానిపై గందరగోళానికి గురవుతున్నారు. దరఖాస్తుకు ప్రభుత్వం నుంచి సరైన మార్గదర్శకాలుగానీ, దరఖాస్తు నమూనాగానీ విడుదల చేయకపోడమే ప్రజల సందేహాలకు కారణమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అధికారుల వద్ద కూడా ఇప్పటివరకూ స్పష్టత లేకపోవడం గమనార్హం. రెండు రోజుల ముందే గ్రామాలకు దరఖాస్తులను అందిస్తామని, ఎవరు ఏ పథకానికి అర్హులో వారు దరఖాస్తు ఫారం నింపి అందించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఇటీవల తెలిపారు. కానీ మంగళవారం రాత్రివరకు కూడా గ్రామాలకు దరఖాస్తు ఫారాలు అందలేదు. గురువారం (ఈ నెల 28) నుంచి ప్రజాపాలన పేరిట గ్రామాల్లో దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం కానున్నది. ఈ నేపథ్యంలో ఆయా పథకాలకు ఎలా దరఖాస్తు చేయాలో తెలియక ప్రజలు ఆగమవుతున్నారు.

### ఒకే దరఖాస్తా? విడివిడిగా చేసుకోవచ్చా?

అభయహస్తంలో భాగమైన మహాలక్ష్మి, గృహజ్యోతి, చేయూత, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్ల గ్యారెంటీలకు సంబంధించి ప్రభుత్వం దరఖాస్తులను స్వీకరిస్తున్నట్టు పేర్కొన్నది. ఈ ఐదు గ్యారెంటీల్లో తొమ్మిది హామీలు ఉన్నాయి. అన్ని గ్యారెంటీలకు కలిపి ఒకే దరఖాస్తు తీసుకుంటారా? లేక గ్యారెంటీలవారీగా విడిగా దరఖాస్తులు తీసుకుంటారా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ హామీల్లో కొన్ని విడి విడిగా వ్యక్తులకు సంబంధించినవి మరికొన్ని కుటుంబం మొత్తానికి సంబంధించినవి ఉన్నాయి. మహాలక్ష్మిలో భాగమైన రూ.2500 మహిళలకు, రైతు భరోసా రైతులకు, చేయూత వృద్ధులకు ప్రత్యేకమైనది. ఇందులో గృహజ్యోతిలో భాగమైన 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు, ఇందిరమ్మ ఇండ్లు వంటివి కుటుంబానికి సంబంధించినవి. ఈ నేపథ్యంలో మహిళలు వ్యక్తిగత పథకాలకు ఒక దరఖాస్తు, కుటుంబ పథకానికి సంబంధించి మరో దరఖాస్తు చేయాల్సి ఉంటుందా? లేక అన్నింటికి ఒకే దరఖాస్తు సరిపోతుందా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

### ఈ పథకాలకు దరఖాస్తు ఎందుకు?

ఐదు గ్యారెంటీల్లో కొన్ని పథకాలకు అసలు దరఖాస్తులు స్వీకరించాల్సిన అవసరమే లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రతి పథకానికి తెల్ల రేషన్‌కార్డును ప్రామాణికంగా పరిగణిస్తున్నట్టు ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. ప్రతి దరఖాస్తుకు రేషన్‌కార్డుతోపాటు ఆధార్‌కార్డును జత చేయాలని సూచించింది. ఈ నేపథ్యంలో ఇప్పటికే రేషన్‌కార్డుల వివరాలు, అందులోని లబ్ధిదారుల వివరాలు పౌరసరఫరాల శాఖ వద్ద ఉన్నాయి. ఇందులో మహిళలు ఎంతమంది? పురుషులు ఎంతమంది? అనే వివరాలు కూడా ఉన్నాయి. ఈ నేపథ్యంలో గృహజ్యోతిలో భాగమైన ప్రతి కుటుంబానికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్తుకు కొత్తగా దరఖాస్తులు ఏ విధంగా స్వీకరిస్తారనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. రూ.500కే గ్యాస్ సిలిండర్ హామీ విషయంలోనూ ఇదే ప్రశ్న ఉత్పన్నమవుతున్నది. రేషన్‌కార్డుదారుల వివరాలు, గ్యాస్ కనెక్షన్ల వివరాలు సివిల్ సప్లై వద్ద ఉన్నాయి. వాటిని క్రోడీకరించి ఈ పథకం అమలు చేస్తే సరిపోతుంది. అయినా మళ్లీ దరఖాస్తు తీసుకుంటున్నది. రైతుభరోసా కోసం రైతుల నుంచి దరఖాస్తు తీసుకుంటామని ప్రకటించింది. గత ప్రతి సీజన్‌లో రైతుబంధు విడుదలకు ముందు కొత్త రైతుల వివరాలను ఆయా ఏఈవోలు సేకరించి వారిని రైతుబంధు జాబితాలో చేర్చారు. ఇలాంటప్పుడు మళ్లీ దరఖాస్తు ఎందుకనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

### కౌలురైతు దరఖాస్తు ఎలా?

రైతులతో సమానంగా కౌలురైతులకు కూడా ప్రతి ఎకరాకు ఏడాదికి రూ.15 వేల చొప్పున పెట్టుబడి సాయం అందిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. ప్రజా పాలనలో భాగంగా రైతు భరోసాకు కూడా దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు వెల్లడించింది. అయితే కొత్త రైతులకు సంబంధించి దరఖాస్తుకు ఇబ్బంది లేకపోయినప్పటికీ కౌలు దరఖాస్తుపై స్పష్టత కరువైంది. అసలు కౌలురైతుల నుంచి దరఖాస్తులు తీసుకుంటామని ప్రభుత్వం ఎక్కడా ప్రకటించలేదు. మిగిలిన పథకాలకు రేషన్‌కార్డును ప్రామాణికంగా ప్రకటించిన ప్రభుత్వం కౌలురైతుల దరఖాస్తుకు ఎలాంటి నిబంధనలను విడుదల చేయలేదు. గ్రామ సభల్లో కౌలు రైతులను గుర్తిస్తామని చెప్పినప్పటికీ దీనికి సంబంధించి ఎలాంటి ఆదేశాలు జారీ చేయలేదు. దీంతో గ్రామ సభల్లో కౌలురైతులు దరఖాస్తు చేసుకోవచ్చా? ఒకవేళ చేసుకుంటే ఏ ఆధారాలు సమర్పించాలనే దానిపై స్పష్టత కొరవడింది.

# మోదీ ముందూ అప్పుల పాట

▶ మొదటిపేజీ తరువాయి

అడగడంతోపాటు రాష్ట్రం అప్పులు, శ్వేతపత్రంపై నివేదిక ఇచ్చామని వారు చెప్పారు. వారి వ్యాఖ్యలపై రాజకీయ, ఆర్థిక నిపుణులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఎవరైనా అప్పులు దాచుకొని, ఆస్తులు చెప్పుకొంటారని, అప్పుడే ఇతరుల దృష్టిలో పతార ఉంటుందని, మార్కెట్‌లో విలువ ఉంటుందని పేర్కొంటున్నారు. అప్పుడే రాష్ట్రానికి పెట్టుబడులు తరలి వస్తాయని, కేంద్రంగానీ, ఇతర ఆర్థిక సంస్థలుగానీ రుణాలు మంజూరు చేస్తాయని చెప్తున్నారు. దివాలా తీసిందని స్వయంగా ప్రచారం చేసుకొంటే ఏం విలువ ఉంటుందని ప్రశ్నిస్తున్నారు.

### మనల్ని అవమానించుకోవడం కదా?

కొన్నేండ్లుగా కేంద్రంలోని ప్రభుత్వం నయానో, భయానో ఇతర రాష్ట్రాలకు రావాల్సిన కంపెనీలను తమ అనుకూల రాష్ట్రాలకు తరలించుకుపోతున్నది. ఇందుకు అనేక ఉదాహరణలు ఉన్నాయి. ఇలాంటి పరిస్థితులను సైతం ఎదురించి తెలంగాణ పారిశ్రామిక రంగం అనేక పెట్టుబడులను సాధించింది. ఇప్పుడు రాష్ట్రం దివాలా తీసిందని చెప్తే పరిశ్రమలు వస్తాయా? అన్నది రాష్ట్ర పాలకులు ఆలోచించలేదా? అని రాజకీయ నిపుణులు ప్రశ్నిస్తున్నారు. తెలంగాణ హక్కుల కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి దేశ ప్రధానిని కలవడం మంచి పరిణామమే అని, కేంద్రంతో మంచి సంబంధాలు కొనసాగిస్తూ రాష్ట్ర అభివృద్ధికి దోహదం చేయాలని చెప్పారు. కానీ రాష్ట్రం అప్పుల్లో ఉన్నదని, అసెంబ్లీలో శ్వేతపత్రం విడుదల చేశామని చెప్పుకోవడం ఇబ్బందికరమైన అంశమేనని అంటున్నారు. ఏకంగా సీఎం, డిప్యూటీ సీఎంలే కేంద్రానికి ఫిర్యాదు చేస్తే రాజకీయంగా మనల్ని మనం అవమానించుకోవడం కాదా?.. రాజకీయంగా ప్రత్యర్థి అయిన బీజేపీకి ఒక అస్త్రం ఇచ్చినట్టు కాదా? అని ప్రశ్నిస్తున్నారు. సాధారణంగా అంతర్జాతీయ పెట్టుబడులు కేంద్రం ద్వారానే రాష్ట్రాలకు వస్తుంటాయని గుర్తు చేస్తున్నారు. ఏదైనా కంపెనీ తెలంగాణలో పెట్టుబడి పెట్టడానికి కంపెనీలు కేంద్రం సలహా తీసుకొంటే.. అప్పుల్లో ఉన్నదని చెప్తే పరిస్థితి ఏమిటని అడుగుతున్నారు. వాస్తవానికి రాష్ట్రాల ఆదాయ, వ్యయాల్లో కేంద్రం జోక్యం చేసుకోదని చెప్తున్నారు. మనం అప్పుల్లో కూరుకుపోయామని చెప్పి, ఎఫ్‌ఆర్బీఎం పరిమితి పెంచాలని కోరితే కేంద్రం అంగీకరిస్తుందా? అని ప్రశ్నిస్తున్నారు.



ఢిల్లీలో ప్రధాని మోదీతో సమావేశమైన సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

### తెలంగాణ ఘనతలు మరిచిపోతే ఎలా?

రాష్ట్రాన్ని అప్పులకుప్పగా చూపెట్టే క్రమంలో కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ సాధించిన ఘనతలను మరుగునపడేస్తున్నదని ఆర్థిక నిపుణులు పేర్కొంటున్నారు. ఆర్బీఐ తాజా నివేదిక ప్రకారం అత్యధిక సొంత పన్ను రాబడులు ఉన్న రాష్ట్రంగా తెలంగాణ ఉన్నదని గుర్తు చేస్తున్నారు. మొత్తం ఆదాయంలో 84.2 శాతం సొంత పన్ను రాబడులే ఉన్నాయని తెలిపారు. జీఎస్డీపీతో పోల్చినప్పుడు అతి తక్కువ అప్పులు చేసిన రాష్ట్రాల్లో తెలంగాణ కింది నుంచి ఐదో స్థానంలో ఉన్నదని అన్నారు. ఇది రాష్ట్ర ఆర్థిక పరిపుష్టికి నిదర్శనమని తెలిపారు. నాస్కామ్ ఇండియా తాజాగా విడుదల చేసిన గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్స్ నివేదిక ప్రకారం ప్రపంచంలోనే అత్యధిక జీసీసీలు ఉన్న నగరంగా హైదరాబాద్ నిలిచిందని గుర్తు చేస్తున్నారు. తద్వారా ప్రపంచ ఐటీ రంగంలో ప్రముఖ స్థానాన్ని సొంతం చేసుకున్నదని చెప్పారు. మెర్సెస్ సంస్థ ఈ ఏడాది విడుదల చేసిన 'క్వాలిటీ ఆఫ్ లివింగ్ -2023' నివేదికలో హైదరాబాద్ మొదటి స్థానంలో నిలిచిందని, ఇది వరుసగా ఆరోసారి అని గుర్తు చేస్తున్నారు. ఇలా జాతీయ, అంతర్జాతీయస్థాయిలో తెలంగాణ అనేక ఘనతలు సాధించిందని, కాంగ్రెస్ ప్రభుత్వ చర్యలతో అవన్నీ మరుగునపడే ప్ర మాదం ఉన్నదని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.




## పెండింగ్ చలాన్లపై రాయితీ నేటి నుంచే..

### బైక్‌లకు 80, కార్లకు 60%

హైదరాబాద్, డిసెంబర్ 26 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని వాహనాల పెండింగ్ చలాన్లపై ప్రకటించిన రాయితీలు బుధవారం నుంచి జనవరి 10వరకు అమలు కానున్నాయి. ఈ మేరకు రవాణా శాఖ కార్యదర్శి కే శ్రీనివాసరాజు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. బైక్‌లు, ఆటోలకు 80 శాతం, ఫోర్ వీలర్లకు 60 శాతం, ఆర్టీసీ బస్సులు, తోపుడు బండ్లపై 90 శాతం, భారీ వాహనాలపై 50 శాతం రాయితీని ప్రకటించారు. రాష్ట్రంలో 2 కోట్లకు పైగా చలాన్లు పెండింగ్‌లో ఉండటంతో పోలీసుశాఖ ఈ నిర్ణయం తీసుకొన్నది. నిరుడు రాయితీ ప్రకటనతో 45 రోజుల్లోనే ఏకంగా 300 కోట్ల ఆదాయం సమకూరింది.

# అడుగంటిన జల విద్యుత్తు!

▶ మొదటిపేజీ తరువాయి...

ఉత్పత్తి చేసేందుకు వీల్లేకుండా పోయింది. అందుకు ప్రత్యామ్నాయంగా థర్మల్ విద్యుత్తు కేంద్రాల్లో ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్ (పీఎల్‌ఎఫ్)ను పెంచాల్సి వచ్చింది. ఫలితంగా విద్యుత్తు సంస్థలపై, అంతిమంగా ప్రభుత్వంపై అదనపు భారం తప్పడం లేదు.

### అడుగంటిన జలాశయాలు

రాష్ట్రంలో ఎక్కువ జల విద్యుత్తు ఉత్పత్తి కేంద్రాలు కృష్ణా నదిపైనే ఉన్నాయి. కానీ ఈ ఏడాది కృష్ణా నదికి వరదలు రాకపోవడంతో పలు రిజర్వాయర్లలో నీళ్లు అడుగంటాయి. ప్రస్తుతం కృష్ణా బేసిన్‌లో కేవలం 53 టీఎంసీలు, గోదావరి బేసిన్‌లో 86.9 టీఎంసీల నీరు మాత్రమే అందుబాటులో ఉన్నది. దీన్ని ఉపయోగించి మొత్తంగా మరో 360.6 మిలియన్ యూనిట్ల విద్యుత్తును మాత్రమే ఉత్పత్తి చేయగలం. కానీ, ఆ నీటిని కూడా రాష్ట్ర ప్రజలకు తాగునీటి అవసరాలకు ఉపయోగించాల్సి ఉండటంతో ఈ ఆర్థిక సంవత్సరంలోని మిగిలిన 3 నెలల్లో జల విద్యుత్తు ఉత్పత్తయ్యే పరిస్థితే లేదు.

### థర్మల్ విద్యుత్తే ఆధారం

ప్రస్తుతం రాష్ట్ర అవసరాల కోసం థర్మల్ విద్యుత్తు కేంద్రాలపైనే దృష్టి సారించాల్సి ఉన్నది. రాష్ట్రవ్యాప్తంగా జెన్‌కో ఆధ్వర్యంలో నడుస్తున్న థర్మల్ విద్యుత్తు కేంద్రాల మొత్తం సామర్థ్యం 4,042.5 మెగావాట్లుగా ఉన్నది. ఈ కేంద్రాల్లో 2021-22 ఆర్థిక సంవత్సరంలో 73.87% పీఎల్‌ఎఫ్‌తో 24,800.3 మిలియన్ యూనిట్లు, గత ఆర్థిక సంవత్సరంలో 71.84% పీఎల్‌ఎఫ్‌తో 25,441.9 మిలియన్ యూనిట్లు, ఈ ఆర్థిక సంవత్సరంలో గత నెల చివరి నాటికి 78.51% పీఎల్‌ఎఫ్‌తో 18,586.2 మిలియన్ యూనిట్ల విద్యుత్తు ఉత్పత్తి చేశారు. యాసంగి వల్ల వచ్చే 3 నెలల్లో విద్యుత్తు డిమాండ్ పెరగనున్నందున పీఎల్‌ఎఫ్‌ను మరింత పెంచాల్సి వస్తుంది. ప్రస్తుతం నెలకు 2,200 మిలియన్ యూనిట్లుగా ఉన్న సగటు థర్మల్ విద్యుత్తు ఉత్పత్తిని రానున్న 3 నెలల్లో 2400 నుంచి 2450 మిలియన్ యూనిట్ల స్థాయికి తీసుకెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఈ నెలలో చలి తీవ్రత పెరగడంతో విద్యుత్తు డిమాండ్ కొంత తగ్గినప్పటికీ వచ్చే ఫిబ్రవరి, మార్చి నెలల్లో ఉష్ణోగ్రతల పెరుగుదల వల్ల విద్యుత్తు డిమాండ్ పెరగడం ఖాయం. దీన్ని అధిగమించాలంటే బహిరంగ మార్కెట్‌లో విద్యుత్తును కొనుగోలు చేయక తప్పదు. దీంతో డిస్కంల పరిస్థితి 'మూలిగే నక్కపై తాటికాయ పడినట్టు' తయారవుతుంది.

## జేఈఈ దరఖాస్తులు 12.3 లక్షలు

### అత్యధిక దరఖాస్తుల్లో తెలంగాణ మూడోస్థానం

హైదరాబాద్, డిసెంబర్ 26 (నమస్తే తెలంగాణ) : జేఈఈ మెయిన్-2024కు దరఖాస్తులు వెల్లువెత్తాయి. రికార్డుస్థాయిలో 12.3లక్షల దరఖాస్తులొచ్చాయి. ఏటా ఈ పరీక్ష రాసే విద్యార్థుల సంఖ్య పెరుగుతున్నది. జేఈఈ-2023 జనవరి, ఏప్రిల్‌లో నిర్వహించిన రెండు సెషన్లతో పోల్చితే ఈసారి 68 వేలు అధికంగా దరఖాస్తులు నమోదయ్యాయి. రాష్ట్రాల వారీగా దరఖాస్తుల స్వీకరణలో మహారాష్ట్ర టాప్‌లో నిలిచింది. ఆ తర్వాత ఏపీ, మూడో స్థానంలో తెలంగాణ ఉన్నది. 2024 జనవరి 24 నుంచి ఫిబ్రవరి 1 వరకు జేఈఈ మెయిన్ -1 పరీక్షలు నిర్వహించనున్నారు. పరీక్షకు మూడు రోజుల ముందు అడ్మిట్‌కార్డులు విడుదల చేస్తారు. ఫిబ్రవరి 12న మొదటి సెషన్ ఫలితాలను వెల్లడిస్తారు. జేఈఈ మెయిన్‌ను ఇంగ్లిష్ సహా 13 భాషల్లో నిర్వహిస్తారు. ఇంగ్లిష్ మీడియంలో హాజరయ్యేందుకు 11 లక్షల మంది దరఖాస్తు చేసుకొన్నారు. ఆ తర్వాత 40వేల మంది విద్యార్థులు హిందీ మీడియంలో, 16,731 మంది విద్యార్థులు గుజరాతీ మీడియంలో పరీక్ష రాసేందుకు దరఖాస్తు చేసుకొన్నారు.

**రాష్ట్రంలో జల విద్యుత్తు ఉత్పత్తి తీరు (మిలియన్ యూనిట్లలో)**

| విద్యుత్తు కేంద్రం | సామర్థ్యం (మెగావాట్లలో) | 2021-22లో ఉత్పత్తి | 2022-23లో ఉత్పత్తి | 2023-24లో (నవంబర్ నాటికి) |
|---|---|---|---|---|
| ప్రియదర్శిని జూరాల | 234.0 | 335.0 | 452.9 | 101.2 |
| లోయర్ జూరాల | 240.0 | 369.3 | 432.2 | 111.2 |
| శ్రీశైలం లెఫ్ట్ | 900.0 | 2076.3 | 2164.6 | 270.3 |
| నాగార్జునసాగర్ | 815.6 | 2262.5 | 2355.6 | 347.4 |
| నాగార్జునసాగర్ లెఫ్ట్ కెనాల్ | 60.0 | 148.3 | 140.1 | 0.0 |
| పులిచింతల | 120.0 | 314.6 | 324.4 | 95.8 |
| సింగూరు | 15.0 | 17.3 | 30.4 | 7.6 |
| నిజాంసాగర్ | 10.0 | 17.6 | 11.3 | 0.0 |
| పోచంపాడు | 36.0 | 109.8 | 138.9 | 51.4 |
| పెద్దపల్లి మినీ | 9.2 | 2.3 | 5.9 | 2.4 |
| పాలేరు మినీ | 2.0 | 1.6 | 1.6 | 0.4 |
| **మొత్తం ఉత్పత్తి** | 2,441.8 | 5,654.7 | 6,058.0 | 987.7 |




# కరోనాతో ఉస్మానియాలో ఇద్దరు మృతి

▶ మొదటిపేజీ తరువాయి...


వ్యాధితో బాధపడుతూ ఉస్మానియాలో అడ్మిట్ అయ్యారు. ఈ నెల 21న సుభాన్‌కి కొవిడ్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. చికిత్స పొందుతూ ఈ నెల 24న మృతి చెందాడు. కిషన్‌బాగ్‌కు చెందిన మహ్మద్ యూసుఫ్ (42) కూడా శ్వాసకోశ సంబంధిత సమస్యలతో ఈ నెల 20న ఉస్మానియాలో చేరారు. ఆయనకు 22న కరోనా పరీక్షలు నిర్వహించారు. చికిత్స పొందుతూ యూసుఫ్ అదే రోజు మరణించారు. వీరిద్దరికి సంబంధించిన కరోనా పరీక్షల నివేదికలు మంగళవారం వచ్చాయి. ఇద్దరికీ కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. వీరితోపాటు ఇటీవల ఉస్మానియాలో చేరిన వికారాబాద్ జిల్లా ధరూర్‌కు చెందిన ఎన్ పార్వతమ్మ (61), రాజేంద్రనగర్‌కు చెందిన ఏళ్ల పల్లె లక్ష్మణ్ (36), మల్లేపల్లికి చెందిన ఎండీ హఫ్సా బేగం (12)కు కరోనా పాజిటివ్‌గా తేలింది. వీరు ప్రస్తుతం దవాఖానలోనే చికిత్స పొందుతున్నారు. అయితే, జేఎన్1 వేరియంట్ వైరస్ తేలికపాటిదేనని, ప్రజలు భయపడాల్సిన అవసరంలేదని డాక్టర్ నాగేందర్ పేర్కొన్నారు. కొవిడ్ వ్యాప్తి నేపథ్యంలో వైద్యులు, నర్సింగ్, పారామెడికల్ సిబ్బందిని అప్రమత్తం చేసినట్టు వివరించారు.

### కనిపించని నియంత్రణ చర్యలు

గత కొన్ని రోజులుగా రాష్ట్రంలో కరోనా కేసులు పెరుగుతున్నా.. అధికార యంత్రాంగంలో అప్రమత్తత కరువైందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటీవల నిలోఫర్‌లో ఇద్దరు చిన్నారులకు కరోనా పాజిటివ్‌గా తేలడంతో వెంటనే వారి కుటుంబసభ్యులకు కూడా పరీక్షలు నిర్వహించి, వైరస్ వ్యాప్తి నియంత్రణకు చర్యలు చేపట్టారు. కానీ ఉస్మానియాలో మరణించిన వారి విషయంలో అలాంటి చర్యలు కనిపించడం లేదు. వారి కుటుంబసభ్యులకు, ప్రధాన కాంటాక్టు వ్యక్తులకు పరీక్షలు నిర్వహించకపోవడం ఆందోళన కలిగిస్తున్నది.

### ఇద్దరు వైద్యులకూ పాజిటివ్?

ఉస్మానియా దవాఖానలో కరోనా వ్యాప్తి విస్తృతం అవుతున్నదా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.



వివిధ అనారోగ్య సమస్యలతో వచ్చిన రోగులకు కొన్ని రోజుల తర్వాత పరీక్షలు నిర్వహిస్తే కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ జరిగింది. వారికి దవాఖానలోనే వ్యాధి సోకిందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఉస్మానియా దవాఖానలో ఇద్దరు వైద్యులతోపాటు మరికొందరు పారిశుద్ధ్య సిబ్బంది కరోనా బారిన పడ్డారని తెలుస్తున్నది. దీనిని అధికారికంగా ఎవరూ ధ్రువీకరించడం లేదు. ఈ నేపథ్యంలో వివరాలు బయటకు పొక్కకుండా తీసుకునే జాగ్రత్తల కంటే వైరస్ వ్యాప్తిని నియంత్రించడంపై దృష్టిసారిస్తే బాగుంటుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

### రాష్ట్రంలో కొత్తగా 8 కేసులు

రాష్ట్రంలో మంగళవారం కొత్తగా ఎనిమిది కొవిడ్ కేసులు నమోదయ్యాయి. నలుగురు కోలుకొని డిశ్చార్జి అయ్యారు. దీంతో ప్రస్తుతం రాష్ట్రంలో 59 యాక్టివ్ కేసులు ఉన్నట్టు వైద్యారోగ్య శాఖ తెలిపింది. కొత్త కేసులన్నీ హైదరాబాద్‌లోనే నమోదయ్యాయని పేర్కొన్నది. కాగా, మహబూబ్‌నగర్ జిల్లా జనరల్ దవాఖానలో మంగళవారం 14 మంది పరీక్షలు చేయించుకోగా.. ఒకరికి పాజిటివ్‌గా వచ్చిందని దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ జీవన్ తెలిపారు.

### ఉస్మానియా ఘటనపై మంత్రి ఆరా

తెలంగాణ రాష్ట్రంలో తొలి కొవిడ్ మరణం ఉస్మానియా దవాఖానలో చోటు చేసుకున్నదనే వార్త దావానంలా వ్యాపించడంతో వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ బీ నాగేందర్‌తో ఫోన్‌లో చర్చించారు. మృతి చెందిన రోగుల ఆరోగ్య పరిస్థితి, ఎలా మరణించారనే అంశాలపై నివేదిక సమర్పించాలని కోరినట్టు తెలుస్తున్నది.

## పీహెచ్‌సీలను బలోపేతం చేయాలి

### పల్లె, బస్తీ దవాఖానల పనితీరు మెరుగవ్వాలి : మంత్రి రాజనర్సింహ



హైదరాబాద్, డిసెంబర్ 26 (నమస్తే తెలంగాణ): ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు పీహెచ్‌సీలను బలోపేతం చేయాలని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం)పై మంగళవారం ఆయన సచివాలయంలో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఎన్‌హెచ్‌ఎంలో భాగంగా అమలవుతున్న పల్లె, బస్తీ దవాఖానలు, పీహెచ్‌సీల పనితీరు మెరుగుపడాలని చెప్పారు. ఆయా దవాఖానల సిబ్బంది గర్భిణులకు పోషకాహారంపై అవగాహన కల్పిస్తూ, వారికి మందులు సరైన సమయంలో అందిస్తూ, మాతాశిశు మరణాలను తగ్గించేందుకు ఎంతో కృషి చేస్తున్నారని అభినందించారు. ప్రభుత్వ దవాఖానల్లో ప్రసవాల సంఖ్యను పెంచాలని పేర్కొన్నారు. అర్హులైన నర్సులకు మిడ్ వైఫరీ శిక్షణ ఇప్పించి, ప్రభుత్వ దవాఖానల్లో సహజ ప్రసవాలు జరిగేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధుల నివారణ చర్యలపై చర్చించారు. టీబీ, కుష్టు వ్యాధి నివారణకు చర్యలు చేపట్టాలని, గ్రామ సభల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. సమీక్షలో కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆర్వీ కర్ణన్, అదనపు డైరెక్టర్ డాక్టర్ అమర్ సింగ్, జేడీలు డాక్టర్ పద్మజ, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ స్వరాజ్యలక్ష్మి, డాక్టర్ రాజేశం, డాక్టర్ జాన్ బాబు, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ ప్రసాద్, డాక్టర్ నందిత, డాక్టర్ శ్రీదేవి డాక్టర్ సుమిత్ర పాల్గొన్నారు.